సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన



పరదేశమ్మ ఆలయంలో అన్నదానంలో పాల్గొన్న పోలారావు

తాటిచెట్లపాలెం: దసరా మహోత్సవాలలో భాగంగా జీవీఎంసీ 42, 55 వార్డుల్లో శ్రీరామ బాలభక్త సమాజం(రామాలయం)అధ్యక్షుడు నూనెల పోలారావు ఆధ్వర్యంలో అన్నసమారాధనలు నిర్వహించారు. ముందుగా రైల్వేన్యూ కాలనీ, తాటిచెట్లపాలెం సరిహద్దు 42వ వార్డు పరదేశమ్మ ఆలయంలో భారీ అన్నదానం నిర్వహించారు. అనంతరం 55వ వార్డు తాటిచెట్లపాలెంలోని రామాలయం వద్ద అన్నసమారాధన చేశారు. నూనెల పోలారావు, లావణ్య కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో ఈ అన్నదానాలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలారావు కుటుంబ సభ్యులు, ఆయా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

మద్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న వారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంచరపాలెం దరి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని శ్రీ నియో ఏజెన్సీ కార్యాలయంలో పేకాట ఆడుతున్నారని అందిన ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాధరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి, ఏడుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.70,980 నగదు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని ఐదో పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ కేసును ఐదో పట్టణ సీఐ ఎన్.సాయి పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన హరికథ



హరికథ చెపుతున్న యతిరాజ్ భాగవతార్ బృందం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా సందర్భంగా నిర్వహిస్తున్న ధర్మ ప్రచారోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకుడు శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. బి.యతిరాజ్ భాగవతార్ బృందం ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం నిర్వహించారు. పట్టాభిరెడ్డి తోటలో సంపత్ వినాయగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వరాల తల్లి పద్మావతిదేవి

మురళీనగర్: భక్తులకు వరాలు ప్రసాదించే కల్పవల్లి పద్మావతి అమ్మవారని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు శేషాచార్యులు అన్నారు. ధర్మప్రచారోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆయన అనుగ్రహభాషణం చేశారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శేషాచార్యులను ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు మధుమోహన్, బంగార్రాజు, విశ్వస్వరూప్, సురేష్, పరశురాముడు, శ్రీరాములు, ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రామచంద్రరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మద్రిపాలెం: కుమార్తె అదృశ్యమైందని ఆమె తల్లి ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గవర కంచరపాలెం దరి రామమూర్తి పంతులుపేటలో ముద్దుని దుర్గాప్రసాద్, భార్య కనకమహాలక్ష్మి, కుమార్తె లక్ష్మి నివసిస్తున్నారు. లక్ష్మి (18) పదో తరగతి వరకు చదువుకుని ప్రస్తుతం ఇంట్లోనే వుంటుంది. ఈ నెల 19న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. ఆమెకు ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

ఓంకార రూపిణి.. జ్ఞాన స్వరూపిణి

- రాజరాజేశ్వరిగా కొలువుదీరిన దుర్గాదేవి
- వైభవంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



సంజీవయ్య కాలనీలో అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ దంపతులు



లలితాపీఠంలో రాజరాజేశ్వరి అలంకరణలో ఉన్న లలితాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



లలితాపీఠంలో జరిగిన పూర్ణాహుతిలో పాల్గొన్న పీఠం మేనేజర్ కృష్ణసేన్



మురళీనగర్‌లోని ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



పూజలు చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు



మురళీనగర్ రామాలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు రామాచారి



బాపూజీనగర్‌లో అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సీతంపేట: జ్ఞానప్రదాయిని, శాంతస్వరూపిణి.. రాజరాజేశ్వరీ దేవి. నవరాత్రి ఉత్సవాల్లో ఆఖరి రోజు విజయదశమి వేళ దుర్గామాతను రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు కనులపండువగా సాగిన మహోత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిశాయి. ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలతో ఆలయాల్లో, మండపాల్లో సందడి నెలకొంది.

లలితాపీఠంలో ముగిసిన ఉత్సవాలు

శ్రీ లలితాపీఠంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు, పంచాయతన యాగ పూర్వక శత చండీయాగం మంగళవారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులు అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. రోజూ విశేష హోమాలు, పండితుల వేదమంత్రాల నడుమ పూజలు, చండీ పారాయణ, లలితా సహస్ర నామ కుంకుమార్చనలతో లలితాపీఠం ఆధ్యాత్మికతతో శోభిల్లింది. నవరాత్రి ఉత్సవాలలో ఆఖరి రోజు లలితా అమ్మవారు రాజరాజేశ్వరి ఆలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ ఏడాది విజయదశమి సోమ, మంగళవారాలలో జరుపుకోవడంతో అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. లలితాపీఠంలో శ్రీవిద్యా హోమం, వేద పండితుల మంత్రాల మధ్య పూర్ణాహుతి, మహాస్నపనం, దీక్షా విరమణ, వేదాశీర్వాదంతో ఉత్సవాలు ముగించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పూర్ణాహుతిలో పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు.

- సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీదేవి శాంతి స్వరూపిణి అలంకారంలో దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. సాయంత్రం జమ్మి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు.

అమ్మవారికి కుంకుమార్చన

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో వెలసిన లలితాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. లలితా దేవికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శ్రీరాజరాజేశ్వరిగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి బూరెలు ప్రసాదంగా సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళలు అత్యధికంగా పాల్గొన్నారు. నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అష్టాదశ పురాణం పుస్తకాలను ఆయన నిర్వాహకులకు అందించారు. ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీఎస్ రెడ్డి, ననపల వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు రామాచారి, ఎం.భానుమూర్తి పాల్గొన్నారు.

సంజీవయ్య కాలనీలో..

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు సంజీవయ్య కాలనీలో దుర్గమ్మ మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం దుర్గాదేవి అమ్మవారిని ప్రతిష్టించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. బుధవారం మధ్యాహ్నం అన్నదాన సమారాధన చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పుష్పలత, సరోజిని, కనక, హైమ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో అన్న సమారాధన

జీవీఎంసీ 48వ వార్డు బాపూజీనగర్‌లో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారిని కార్పొరేటర్ గంకల కవిత దంపతులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్నాహం జరిగిన అన్నసమారాధనను బీజేపీ జిల్లా పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు అప్పారావు ప్రారంభించారు. సుమారు 2 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుడుముల దామోదర్, సుందరం, కుమార్, రాజేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రత్యేక పూజలు


సీతమ్మధార : విజయదశమి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో ఆ పార్టీ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని 2024లో రెండో మారు సీఎంగా గెలిపించుకోవాలన్నారు. మన సీఎం డిసెంబర్ నుంచి విశాఖ నుంచి పరిపాలన కొనసాగించనున్న తరుణాన.. ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని ప్రార్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కఠారి అనిల్‌కుమార్‌రాజు, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జేసీఎస్ మండల కన్వీనర్లు నీలి రవి, బులుసు జగదీష్, లంకా భాస్కరరావు, హరి పట్నాయక్, సాయి, బొడ్డేటి కిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా దుర్గాదేవి మండపం

నవంబర్ 1వ తేదీ వరకు ఉత్సవాలు



సింహం ఆకృతిలో మండపం ప్రవేశ ద్వారం



సీతంపేటలో గ్లాస్ ఫ్లోరింగ్ అక్వేరియంతో దుర్గాదేవి మండపం

సీతంపేట: క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో సీతంపేటలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి నవంబరు ఒకటి వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల కోసం అమ్మవారి మండపాన్ని వినూత్నంగా తీర్చిదిద్దడంతో మండపం చూడటానికి భక్తులు బారులు తీరుతున్నారు. పీవోపీ ఫాల్స్ సీలింగ్, గ్లాస్ అక్వేరియం ఫ్లోరింగ్, సింహం ఆకృతిలో మండపం ప్రవేశ ద్వారం చూపరులను విశేషం ఆకట్టుకుంటున్నాయి. మండపం లోపలి భాగం ఇంటిని తలపిలచేలా ఇంటీరియర్ డిజైన్ చేశారు. అలాగే గ్లాస్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేశారు. గ్లాస్ ఫ్లోరింగ్ కింద అక్వేరియంలో చేపలు తిరుగుతూ ఉండటం మండపానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండపం నిర్మాణానికి లక్షన్నర ఖర్చు అయిందని, రోజూ విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని క్రేజీ బాయ్స్ కమిటీ తెలిపింది. కమిటీ సభ్యులు అచ్యుతరావు, వై.గణేష్, సంతోష్, బి. సంతోష్, పి.శేఖర్, కె. రాంమూర్తి, మహేష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ధ్యానమందిరంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు



షిర్డీసాయి ధ్యానమందిరంలో సాయిబాబాకు విభూది అభిషేకం చేస్తున్న భక్తులు



సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



బాపూజీనగర్‌లో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో 29వ వార్షికోత్సవం, దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం విష్వక్సేనపూజ, పంచామృతాభిషేకాలు, రుద్రాక్షల పూజ, సాయినాథ హోమం నిర్వహించారు. అనంతరం కాశీ, హరిద్వార నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలకు భక్తుల స్వహస్తాలతో అభిషేకం, పవిత్ర నదీజలాలతో, పాలతో బాబాకు అభిషేకం చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం మహాఅన్నసంతర్పణ నిర్వహించారు. మధ్యాహ్నం బాబా 105వ మహాసమాధి సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని దీపారాధన చేశారు. రాత్రి బాబాకు భక్తుల స్వహస్తాలతో విభూది అభిషేకం, సాయిబాబా గీతాలాపన చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు, భజన బృంద సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీతమ్మధార : దేవదాయ శాఖ శ్రీమహాగణపతి ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా ఆలయంలో దేవీ నవరాత్రులు, ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. విజయ దశమి, బాబా సమాధి రోజు సందర్భంగా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు దుర్గాహోమం, మహాలక్ష్మి దుర్గా అమ్మవారికి అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకుడు రాజా స్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం సత్యరాజ్ సంగీతాలయ బాల గణేష్ బృందంచే భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శివ, వనజాక్షి, తదితరులు పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో..

కంచరపాలెం : స్థానిక 104 ఏరియా బాపూజీనగర్‌లో శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం షిర్డీ సాయిబాబా సమాధి వేడుకలను ఆలయ అనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనువాసరావు నేతృత్వంలో ప్రధాన అర్చకులు సూర్య ప్రకాష్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా విగ్రహానికి భక్తులు స్వహస్తాలతో క్షీరాభిషేకం చేశారు. ప్రతిమను ఊరేగించారు. ఆంజనేయులు, ప్రభాకర్, పైడిరెడ్డి పాల్గొన్నారు.

అప్పన్న భక్తులకు కొర్రబియ్యం పాయసం



భక్తులకు పాయసం అందిస్తున్న సిబ్బంది



భోజనం చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం సింహగిరిపై అన్నప్రసాద భవనంలో భక్తులకు అన్నప్రసాదంతో పాటు కొర్రబియ్యం పాయసం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి భక్తులతో పాటు కలిసి అన్నప్రసాదభవనంలో సహపంక్తి భోజనం చేశారు. ఆలయ ఏఈవో పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జమ్మి ఉత్సవం.. పరవశించిన భక్త జనం



విద్యుత్ కాంతుల్లో పూలతోటలోని శ్రీకృష్ణ కొలను



కోలాటం ఆడుతున్న మహిళలు

- సింహగిరికి పోటెత్తిన భక్తులు
- విద్యుత్ కాంతుల్లో కొలను

సింహాచలం: సింహగిరి భక్తులతో పులకించింది. అంతటా ఆధ్యాత్మికత ఉట్టిపడింది. మంగళవారం విజయదశమి పర్వదినాన స్వామిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి జరిగిన జమ్మివేట ఉత్సవంలో భక్తులు తరించారు. రామాలంకారంలో స్వామిని కనులారా వీక్షించి పరవశించారు. విద్యుత్ కాంతులతో కొండదిగువ పూల తోట నూతన శోభ సంతరించుకుంది. ఉత్సవాన్ని తిలకించేందుకు పూలతోటకు వేలాది మంది భక్తులు క్యూకట్టారు. సాయంత్రం 5గంటల సమయంలో సింహగిరి నుంచి కొండదిగువకు మెట్లమార్గంలో స్వామివారిని తీసుకొచ్చారు. అక్కడ దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అధికారులు, అడవివ రం గ్రామస్తు లు ఘన స్వాగతం పలికారు. అక్కని నుంచి స్వామిని పూలతోటలోకి తీసుకెళ్లారు. పూల తోటలోని మండపంలో జమ్మివేట ఉత్సవం విశేషంగా జరిగింది. అలాగే అడవివరం పురవీధిల్లో అశ్వ వాహనంపై స్వామి తిరువీధి ఘనంగా జరిగింది. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఉత్సవంలో పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సీతమ్మధార : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలెం లలిత గుడి వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి(60) చనిపోయినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు విజయనగరం జిల్లాకు చెందిన వ్యక్తి అని భావిస్తున్నారు. హెచ్‌సీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీరం.. సుందరం.. మరింత భద్రం

విశాఖ అంటే ముందుగా గుర్తుకొచ్చేది ఆర్కే బీచ్. నగరాన్ని, ఆర్కే బీచ్‌ను విడివిడిగా చూడలేం. రోజూ వేల మంది సందర్శకులు వస్తుంటారు. వీకెండ్స్‌లోనైతే.. తీరం జన సంద్రమేనంటే అతిశయోక్తి కాదు. పర్యాటకులు, సందర్శకులు మక్కువ చూపే ఆర్కే బీచ్‌ను మరింత సుందరంగా, భద్రంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ యంత్రాంగం నడుం బిగించింది.

- ఆర్కే బీచ్‌లో అభివృద్ధి, రక్షణ పనులు
- సిద్ధమవుతున్న స్మార్ట్ బస్టాప్



సిద్ధమవుతున్న స్మార్ట్ బస్టాప్

బీచ్‌రోడ్డు: విశాఖ తీరంలోని రామకృష్ణా(ఆర్కే)బీచ్ ఇప్పటికే పర్యాటకులకు స్వర్గధామం. తీరంలో నాటిన కొబ్బరి చెట్లు, వాటిని ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులతో రాత్రుళ్లు వాటి అందం మరింత ఇనుమడిస్తుంది. బీచ్ రోడ్డు డివైడర్లపై కూడా వివిధ రకాల మొక్కల్ని ఏర్పాటు చేసి, అందంగా తీర్చిదిద్దారు. ఇపుడు చేపట్టిన పనులతో సాగరతీరం మరింత ఆకర్షణీయంగా కనిపించనుంది. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు చేపట్టిన ఆ పనులన్నీ శరవేగంగా కొనసాగుతున్నాయి.

సిద్ధమవుతున్న స్మార్ట్ బస్టాప్

నగరంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన స్మార్ట్ బస్టాప్‌లు సాగర తీరానికీ చేరాయి. సుమారు రూ.16 లక్షల వ్యయంతో ఆర్కే బీచ్ వద్ద జీవీఎంసీ చేపట్టిన స్మార్ట్ బస్టాప్ నిర్మాణం దాదాపు పూర్తయింది. త్వరలో జీవీఎంసీ అధికారులు దీనిని ప్రారంభించనున్నారు. రాత్రి పూట ఈ బస్టాప్ ప్రత్యేక ఆకర్షణగా మారనుందనడంలో సందేహం లేదు. వీటి డిజైన్, లైటింగ్ బస్టాప్ పరిసరాలను అందంగా మార్చుతున్నాయి. ప్రయాణికులు సేదతీరడంతోపాటు, వీటి ముందు సెల్ఫీలు తీసుకునేందుకూ ఇష్టపడుతున్నారు.

కెరటాల నుంచి రక్షణ

విశాఖ తీరంలో బీచ్‌రోడ్డుకు అతి సమీపంలో కెరటాల తాకిడి ఉండేది ఆర్కే వీచ్ మాత్రమే. భారీ కెరటాల కారణంగా రక్షణ గోడ కోతకు గురవుతోంది. దీని వల్ల భవిష్యత్తులో బీచ్ రోడ్డు కోతకు గురవకుండా జీవీఎంసీ యంత్రాంగం సిద్ధమయింది. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు పటిష్టమైన రక్షణ గోడ నిర్మాణాన్ని చేపట్టింది. ఈ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. దీంతో పాటు సందర్శకులు తీరంలోకి వెళ్లి, ఇసుకతిన్నెలపై సేదదీరి, అలల అందాన్ని ఆస్వాదించేందుకు వీలుగా రక్షణ గోడ నుంచి మరిన్ని మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు.



శరవేగంగా సాగుతున్న రక్షణ గోడ పనులు

కొబ్బరి చెట్లకు రక్షణకు ఏర్పాట్లు

ఆర్కే బీచ్‌ను ఆనుకుని కొన్ని చోట్ల ప్రత్యేక ఏర్పాట్లతో నాటిన కొబ్బరి చెట్లకు కెరటాలు తాకిడి పెరుగుతోంది. దీంతో కోతకు గురై, నేలకు ఒరుగుతున్నాయి. వాటికి అలల ఒత్తిడి తగ్గించేలా అధికారులు రక్షణ చర్యలు ప్రారంభించారు. కొబ్బరి చెట్లు ఉండే ప్రాంతాలకు అడ్డంగా పెద్ద పెద్ద రాళ్లు వేశారు. దీంతో అలల తాకిడి తగ్గి, కొబ్బరి చెట్లు మరింత కాలం సందర్శకుల్ని ఆకట్టుకోనున్నాయి.

కమనీయం .. కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com